సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



'భారజలం' బెస్ట్ పర్‌ఫార్మెన్స్..
అశ్వాపురంలోని భారజల కర్మాగారానికి 2021-22 ఏడాదికి బెస్ట్ పర్‌ఫార్మెన్స్ ప్లాంట్ అవార్డు ప్రకటించారు. 10లో



ఖమ్మం నుంచి ఒడిశా..
ఉమ్మడి జిల్లా నుంచి సరిహద్దు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 19°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది.

ప్రజలకు అండగా 'సాక్షి'

పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌తో 'ఫోన్ ఇన్'



పాల్వంచ: పట్టణ వాసులను కుక్కలు, కోతుల బెడద వేధిస్తోంది. దీనికి తోడు తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్ల సమస్య ఎదుర్కొంటున్న వారు ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా 'సాక్షి' సమన్వయం చేయాలని సంకల్పించింది. ఈమేరకు శనివారం ఫోన్ ఇన్ ఏర్పాటుచేయగా పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు పరిష్కారానికి పాటుపడతారు.

తేది : 25 - 02 - 2023, శనివారం
సమయం : ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్
98499 05884

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మ తల్లి) ఆలయంలో అమ్మవారికి 108 సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. వేదపడింతులు పద్మనాభ శర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు

7న చండీహోమం

వచ్చే నెల 7న యాగశాలలో చండీహోమ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలను నమోదుచేసుకోవాలని కోరారు. వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డీఈఓగా మళ్లీ సోమశేఖరశర్మ

కొత్తగూడెంఅర్బన్: జిల్లా విద్యాధికారిగా(ఎఫ్ఏసీ) ఇ.సోమశేఖరశర్మ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఏ.శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. గత జనవరి 30న డీఈఓగా ఎస్ఎస్ఎస్.ప్రసాద్ బాధ్యతలు చేపట్టగా, సోమశేఖరశర్మను ఖమ్మం జిల్లాకు బదిలీ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ నేపథ్యంలో ఎస్ఎస్ఎస్.ప్రసాద్‌ను హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా జిల్లాకు కేటాయించారు. ప్రస్తుతం బదిలీల షెడ్యూల్ నిలిచిపోవడంతో ఎస్ఎస్ఎస్.ప్రసాద్‌ను యథాస్థానానికి పంపిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సోమశేఖరశర్మకు జిల్లా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

జామాయిల్ సాగుకు మరింత ప్రోత్సాహం



రైతులతో మాట్లాడుతున్న ఐటీసీ అధికారులు

బూర్గంపాడు: జామాయిల్, సుబాబుల్ సాగుకు రైతులను మరింతగా ప్రోత్సహిస్తామని ఐటీసీ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వదిరాజ్ కులకర్ణి అన్నారు. ఐటీసీ ప్లాంటేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీపురంలోని ఐటీసీ ప్లాంటేషన్ ఏరియాలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు నికర ఆదాయం పొందేందుకు జామాయిల్ ప్లాంటేషన్‌లను విస్తరించాలని చెప్పారు. ఐటీసీ జనరల్ మేనేజర్ జగదీష్ టమక్ మాట్లాడుతూ ఈ ఏడాది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో 23వేల హెక్టార్లలో జామాయిల్ సాగు చేశామన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ అధిక దిగుబడి సాధించేందుకు ఐటీసీ కొత్త క్లోనల్ మొక్కలను అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు. అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తులు సాధించిన 23 మంది రైతులను ఈ సందర్భంగా సన్మానించారు. ఐటీసీ ఉన్నతాధికారులు సునీల్‌పాండే, సిద్ధార్థమొహంతి, అమిత్‌సింగ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంతా మేమే చూసుకుంటాం





మా కనుసన్నల్లోనే కారుణ్య నియామకాలంటూ..
- భ్రమలు కల్పిస్తూ రూ. లక్షలు దండుకుంటున్న దళారులు
- మెడికల్ బోర్డు ఇంటర్వ్యూలపై అపోహలు సృష్టి
- మాయమాటలు నమ్మి నష్టపోతున్న సింగరేణి కార్మికులు
- అవకతవకలపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టని యాజమాన్యం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అవినీతి ఆరోపణలకు కేంద్ర బిందువుగా మారిన కారుణ్య నియామకాల్లో పారదర్శకత తీసుకొచ్చే విషయంలో సంస్థాగతంగా జరుగుతున్న చేపడుతున్న మార్పులు, తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయనే భావన సర్వత్రా నెలకొంది. దీంతో మొత్తం నియామక ప్రక్రియతో ఎటువంటి సంబంధం లేని కొందరు కార్మిక సంఘ నేతలు, దళారులు తమ వల్ల ఏదో జరిగిపోతోందని భ్రమను కల్పిస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు. తద్వారా సంస్థకు చెడ్డ పేరు తీసుకువస్తున్నారు.

కోడ్‌తో నడిపిస్తున్నారు

కారుణ్య నియామకాల ప్రక్రియలో కీలకంగా మారిన మెడికల్ బోర్డు ఇంటర్వ్యూలు జరుగుతున్న తీరుపై అనేక ఆరోపణలు ఉన్నాయి. కొందరు దళారుల తీరు కారణంగా మెడికల్ బోర్డుకు చెడ్డ పేరు వస్తుందనే ఉద్దేశంతో బోర్డు సభ్యుల్లో చాలా మంది నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. దీంతో మొత్తం నియామకాల ప్రక్రియలో కీలకంగా ఉండే కొందరి సాయంతో దళారులు పనులు చక్కబెట్టుకుంటున్నారు. అనుకున్న విధంగా పని జరగాలంటే తాము సూచించిన విధంగా మెడికల్ బోర్డు ముందు హాజరుకావాలంటూ సూచనలు చేస్తున్నారు. అందులో చేతి వేలికి ఫలానా రంగు ఉంగరం పెట్టుకోవడం, జేబులో పైకి కనిపించేలా కర్చీఫ్ ఉంచుకోవడం, మెడలో తువ్వాలు వేసుకోవడం తదితర కోడ్‌లు సూచిస్తున్నట్లు బోర్డు ముందు హాజరైన కార్మికులు వెల్లడించారు. ఇందులో కోడ్‌లతో మెడికల్ బోర్డు సభ్యులకు ఎంత సంబంధం ఉందనే విషయంపై ఎవరికీ స్పష్టత ఉండదు. కానీ దళారులు చేసే హడావుడితో ఏదో జరిగిపోతుందనే భ్రమలో లక్షల రూపాయలు వారికి ముట్టచెబుతూ కార్మికులు తమ కష్టార్జితం నష్టపోతున్నారు.

మచ్చ తొలగడం లేదు

సింగరేణి సంస్థలో కొలువులకు రెడ్ కార్పెట్ ఎంట్రీగా మారిన కారుణ్య నియామకాలపై ఆరోపణలు చుట్టుముడుతున్నాయి. కారుణ్య నియామకాల్లో కేవలం దళారుల బిల్డప్‌ల కారణంగా పైసలు ముట్టచెప్పకపోతే పని జరగదనే భావన ఏర్పడింది.

చర్యల్లేవ్..
కొత్తగూడెం మున్సిపాలిటీలో కీలక ప్రజాప్రతినిధిగా చక్రం తిప్పుతున్న ఓ కుటుంబానికి చెందిన వ్యక్తి సింగరేణి ఉద్యోగిగా పని చేస్తూనే కార్మిక నాయకుడిగా కొనసాగుతున్నారు. రామగుండం ఏరియాకు చెందిన ఓ కార్మికుడి కారుణ్య నియామకం విషయంలో సహాయం చేస్తానంటూ భారీ ఎత్తున డీల్ చేశాడు. చివరకు ఆ డీల్ వికటించడంతో రచ్చరచ్చ అయ్యింది. ఈ విషయం సంస్థలోని పెద్దలకు తెలియడంతో సింగరేణి విజిలెన్స్ విభాగం అంతర్గత విచారణ చేపట్టింది. నెలలు గడిచినా ఇంత వరకు విచారణలో పురోగతి లేదు. అంతకు ముందు మెడికల్ బోర్డు ఇంటర్వ్యూలు జరుగుతున్న సమయంలో శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన ఓ కార్మికుడి దగ్గర రూ.50 వేలు లభించాయి. దీనిపై విచారణ చేపట్టినా .. నేటికీ చర్యలు తీసుకోలేదు. కారుణ్య నియామకాల విషయంలో బెల్లంపల్లి ఏరియాలో ఓ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం కూడా ఉంది. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు సరైన ఆధారాలు సేకరించడంలో నిర్లక్ష్యం, దీనికి తోడు రాజకీయ ఒత్తిళ్లు పెరగడంతో కారుణ్య నియామకాల్లో అవినీతికి అడ్డుకట్ట పడటం లేదు.

దీంతో సగానికి పైగా కేసుల్లో లక్షల్లో డబ్బులు చేతులుమారుతున్నాయనేది బహిరంగ రహస్యమే. అయినప్పటికీ కార్మికుల్లో అవగాహన కల్పించేందుకు, 'మెడికల్ బోర్డు'పై ఉన్న మచ్చ తొలగించేందుకు సంస్థ పరంగా చేపట్టిన జాగ్రత్తలు నామమాత్రంగానే ఉన్నాయి. కారుణ్య నియామకాలకు సంబంధించి మెడికల్ బోర్డుకు హాజరయ్యేవారిలో నూటికి తొంభై మంది విషయం బయటకు చెప్పరు. డీల్ మధ్యలో ఏమైనా పొరపొచ్చాలు వస్తే కార్మికుడు, సంఘం నాయకులు, దళారులే మాట్లాడి పరిష్కరించుకుంటారు. ఎప్పుడో ఒకసారి విషయం బయటకు వస్తుంది. ఇలాంటి సందర్భాల్లో ఆయా కేసులపై దృష్టి సారించి, లోపాలను గుర్తించాల్సి ఉంది. తదనంతరం మరింత పకడ్బందీగా నియామకాల ప్రక్రియ చేపట్టాల్సిన బాధ్యత సింగరేణి యాజమాన్యంపై ఉంది. కానీ నామమాత్రపు చర్యలు తప్పితే కారుణ్య నియామకాల్లో లొసుగులపై లోతైన విచారణ జరగడం లేదు.

పరీక్షా కాలం..!

- ప్రిపరేషన్‌లో విద్యార్థులు బిజీ బిజీ..
- కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్
- మార్చి 15 నుంచి థియరీ పరీక్షలు
- ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు



తరగతి గదిలో విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: వార్షిక పరీక్షల సమయం సమీపిస్తోంది. పాఠశాల, కళాశాలల విద్యార్థులు ప్రిపరేషన్‌లో బిజీ అయ్యారు. ఇప్పటికే కొన్ని పరీక్షలు ప్రారంభంకాగా ఏప్రిల్ వరకు అన్ని తరగతులు, కోర్సుల పరీక్షలు పూర్తికానున్నాయి. పదో తరగతి సిలబస్ పూర్తికాగా, ఉపాధ్యాయులు రివిజన్ చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు సక్రమంగా హాజరయ్యేందుకు అల్పాహారం కూడా ఇస్తున్నారు. గతే ఏడాది జిల్లాలో పదో తరగతిలో 86.83 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి డీఈఓ సోమశేఖర శర్మ చెబుతున్నారు. తగిన ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నామని, జనవరి నెల నుంచి పూర్తయిన సిలబస్‌పై రివిజన్, స్లిప్ టెస్టులు వంటివి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పరీక్షలో ప్రతి ప్రశ్నకు జవాబు రాసేలా విద్యార్థులను తయారు చేస్తున్నారు. ఈనెలాఖరులో ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇక 1 నుంచి 9వ తరగతుల విద్యార్థులకు ఏప్రిల్‌లో వార్షిక పరీక్షలు నిర్వహించనునున్నారు. ఈ ఏడాది నుంచి 1–8 తరగతుల వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధన చేపట్టడంతో అడ్మిషన్ల సంఖ్య కూడా పెరిగింది. దీంతోపాటు మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడటంతో వచ్చే విద్యాసంత్సరంలో అడ్మిషన్ల సంఖ్య ఇంకా పెరగనుంది.

గతేడాది పదో తరగతిలో 86.83 శాతం ఉత్తీర్ణత..

గతేడాది జిల్లాలో 13,173 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 11,438 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత 86.83 శాతం నమోదయింది. ఉత్తీర్ణతతో పాటుగా విద్యార్థుల ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో 1.30 గంటల చొప్పున స్పెషల్ క్లాసులు జరుగుతుండగా, ఇదే మాదిరిగా ప్రైవేటు పాఠశాల్లో కూడా తరగతులు నిర్వహించాల్సి ఉంది. కానీ సాయంత్రం వేళలో ఎక్కువ సమయం వరకు చదివించి మళ్లీ ఉదయాన్నే పాఠశాలకు రప్పించడం వల్ల విద్యార్థులపై అధిక ఒత్తిడి పడే అవకాశం ఉంటుంది. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉంటూ చదువుకునేలా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

పరీక్షల షెడ్యూల్ ఇలా..
- ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 15 నుంచి ప్రారంభంకాగా, మార్చి 2వ తేదీ వరకు జరుగనున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 9,379 మంది పరీక్షలు రాస్తున్నారు.
- 1–9 వ తరగతి విద్యార్థులు ఎస్ఏ–2 ఫైనల్ పరీక్షలు ఏప్రిల్ 12 నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి.
- మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సర పరీక్షలు జరుగనున్నాయి. ఈ ఏడాది మొదటి సంవత్సరం విద్యార్థులు 10,363 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 9,504 మంది పరీక్షలు రాయనున్నారు.
- పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి జరుగనున్నాయి.
- పదో తరగతి ఫైనల్ పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు జరుగనుండగా, ఈ ఏడాది మొత్తం 12,490 మంది పరీక్షలు రాయనున్నారు.

ఒత్తిడికి గురికావొద్దు



విద్యార్థులంతా కూడా ప్రశాంతంగా ఉంటూ పరీక్షలకు సిద్ధం కావాలి. ఎవరూ పరీక్షల పట్ల భయాందోళనలు చెందవద్దు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు ఈ ఏడాది ఆరు పేపర్లు మాత్రమే ఉంటాయి. ఈ నేపథ్యంలో మంచి మార్కులు తెచ్చుకునేందుకు అవకాశం ఎక్కువగా ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– సోమశేఖర శర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న విప్ కాంతారావు, పక్కన నాయకులు

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే, విప్ రేగా కాంతారావు తెలిపారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పినపాక నియోజకవర్గం కోసం ఇటీవల కేసీఆర్ ఇచ్చిన ప్రత్యేక నిధులు రూ.100 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీలు, అంతర్గత రోడ్ల నిర్మాణం, చెరువులు, గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ బీటీరోడ్ల నిర్మాణం చేపడుతామని చెప్పారు. ఆళ్లపల్లిలో 28 పనులు, అశ్వాపురంలో 92, బూర్గంపాడులో 108, మణుగూరులో 98, పినపాకలో 80, కరకగూడెంలో 63, గుండాలలో 21 పనులు మొత్తం 487 రకాల అభివృద్ధి పనులకు ప్రణాళిక పూర్తయిందని పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధికి రూ.300 కోట్లు మంజూరు చేయించినట్లు విప్ కాంతారావు తెలిపారు. ఇక మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.25 కోట్లను సీఎం కేసీఆర్ తాజాగా మంజూరు చేశారని చెప్పారు. విద్యార్థుల కోసం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయగా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. సమావేశంలో పోశం నర్సింహారావు, ముత్యం బాబు, అడపా అప్పారావు, కుర్రి నాగేశ్వరరావు, గుడిపూడి కోటేశ్వరరావు, రమాదేవి, కత్తి రాము, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, అక్కిరెడ్డి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న యెర్రా కామేష్

పాల్వంచ: నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని వనమా కాలనీ, హమాలీ కాలనీల్లో పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ ఏ ఏరియాకు వెళ్లినా తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నారని అన్నారు. వారం రోజులుగా కాలనీల్లో తాగునీరు రాకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే వనమాకు పాల్వంచలో తాగునీటి సమస్యలు కనిపించడం లేదని విమర్శించారు. ఈ నెల 25న కొత్తగూడెం చిల్డ్రన్స్ పార్క్ వద్ద నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు బీఎస్పీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దొంతుజ్ ప్రమీల, రమణ, మరియమ్మ, ముత్తమ్మ, కమల, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాలకు స్థల పరిశీలన

జెడ్పీ సీఈఓ విద్యాలత



తొమ్మిదోమైలుతండాలో క్రీడా మైదానం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

టేకులపల్లి: మండలంలో క్రీడా మైదానాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ విద్యాలత సూచించారు. గురువారం ఆమె మండలంలోని తొమ్మిదోమైలుతండా, బేతంపూడి, గోలియాతండా పంచాయతీల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. తొమ్మిదో మైలుతండాలో కంటివెలుగు శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. అంధత్వాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్‌లు జర్పుల బిచ్చా, బోడ నిరోషా, ఏపీఓ కాశంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, గురుకులం ప్రిన్సిపాల్ చైతన్య, పంచాయతీ కార్యదర్శి కృష్ణ కుమారి, కంటి వెలుగు వైద్యాధికారి శ్రావణి, ఫాతిమా, సతీష్, సూపర్‌వైజర్లు గుజ్జ విజయ, నాగుబండి వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతికి ప్రత్యేక క్లాసులు



పాల్వంచ: ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతిలో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. గురువారం విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాకాటి కరుణ పదో తరగతి పరీక్షలు, మన ఊరు- మన బడి, తొలిమెట్టు కార్యక్రమాలపై హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వీసీకి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12,490 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని, వీరి కోసం 71 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టామని, మాక్ పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోయేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో జిల్లాలో ఎంపిక చేసిన 46 మోడల్ పాఠశాలల్లో రెండు పాఠశాలలు ప్రారంభించామని, 29 పూర్తి స్థాయిలో పూర్తయ్యాయని, మరో రెండు పనులు పురోగతిలో ఉన్నాయని, ఇంకా రెండు పాఠశాలల్లో పనులు ప్రారంభించాల్సి ఉందని వివరించారు. ఒక పాఠశాలకు టెండరు ప్రక్రియ పూర్తి కాలేదని, త్వరలో పూర్తి చేసి, పనులు ప్రారంభిస్తామని చెప్పారు. తొలిమెట్టు కార్యక్రమంతో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు రీడింగ్, రైటింగ్‌లో పురోగతి సాధించారని పేర్కొన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాల విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్టడంతో సత్ఫలితాలు వచ్చాయని తెలిపారు. పరీక్షల సహాయ సంచాలకులు మాధవరావు, అకడమిక్ కోఆర్డినేటర్ నాగరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటిగ్రేటెడ్' వేగవంతం చేయాలి

పాల్వంచ: పాల్వంచలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు వేగవంతం చేయాలని, మే నాటికి పూర్తి కావాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. గురువారం మున్సిపాలిటీలోని కేసీఆర్ నగర్, శ్రీనివాస కాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న వైకుంఠ ధామాలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయ నిర్మాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్, డీఈ మురళి, పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీనివాస్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

సుజాతనగర్: గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శేషుకుమార్ ఆదేశించారు. సుజాతనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆయన రికార్డులను తనిఖీ చేశారు. ఆదాయ వ్యయాలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. ప్రతి పనికి నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. డీపీఓ రమాకాంత్, ఎంపీఓ మోయినుద్దీన్‌ఖాన్, సర్పంచ్ సీకా కృష్ణవేణి, సెక్రటరీ నరేందర్ పాల్గొన్నారు.

ముబీన్ పాషాకు జాతీయ పురస్కారం



ఎస్పీ వినీత్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ముబీన్ పాషా

కొత్తగూడెంటౌన్/జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లుకు చెందిన విద్యార్థి ఎస్కే ముబీన్ పాషాకు ఇండియన్ స్కాట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్(ఎస్‌జీఎఫ్) నేషనల్ యూత్ అవార్డు లభించింది. ఈ అవార్డు కింద పతకం, ప్రశంసాపత్రం, రూ.10 వేల చెక్కును బుధవారం ఆయన ఎస్పీ డాక్టర్ వినీత్ చేతులు మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోగాని శ్రీనివాస్, మహ్మద్ ఖాసీంతో పాటు బొడ్డు శ్రీనివాస్, జ్యోతిరాణి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు. కాగా, డిగ్రీ పూర్తి చేసిన ముబీన్ ఉద్యోగ పోటీలకు పరీక్షలకు సిద్ధమవుతున్నాడు.

పోరాడి సాధించుకుందాం..

ఇల్లెందురూరల్: కొమరారం మండలాన్ని పోరాడి సాధించుకుందామని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా అన్నారు. మండలంలోని కొమరారం గ్రామంలో కొమరారం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని 23 రోజులుగా రిలే దీక్షలు చేస్తుండగా, గురువారం ఆయన శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం తెలిపి మాట్లాడారు. రెవెన్యూ డివిజన్, నూతన మండలాల కోసం ఐక్య పోరాటాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఉడత ఐలయ్య, కౌన్సిలర్ రవి, నాయకులు ఎస్‌కె వలి, సాంబమూర్తి, ప్రజాపంథా నాయకులు ఆజ్మీర బిచ్చా, బండారు సత్యం, మల్లిపెద్ది జాన్‌బాబు, కుంజర సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమంగా పట్టా చేయించుకున్నారు..



ప్లకార్డులతో దీక్షలో ముత్తయ్య వారసులు

జూలూరుపాడు: ఇనామ్ భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం వెంగన్నపాలెం గ్రామంలో ఓ కుటుంబం గురువారం జూలూరుపాడులో నిరాహార దీక్షకు దిగింది. ఈ సందర్భంగా తంబర్ల నర్సింహారావు తదితరులు మాట్లాడుతూ గుండెపుడి రెవెన్యూ పరిధిలో 1.09 ఎకరాల ఇనామ్ భూమిని దళితుడైన తమ తాత తంబర్ల ముత్తయ్యకు ప్రభుత్వం కేటాయించగా, అదే గ్రామానికి చెందిన వ్యక్తులు అక్రమ పత్రాలతో 2000లో పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో దీక్ష చేపట్టామని తెలిపారు. గిర్దావర్ తిరుపతి రావు, పోలీసులు చేరుకుని సమస్య పరిష్కరిస్తామని చెప్పగా భూమి అప్పగించే వరకు దీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, తంబర్ల ముత్తయ్య వారసులు నర్సింహారావు, రాఘవులు, నరేశ్, సీతారాములు, మరియమ్మ, అనసూర్య, నాగమ్మ తదితరులు దీక్ష కొనసాగిస్తున్నారు.

నేడు పరిశ్రమల యజమానులకు సదస్సు

భద్రాచలంఅర్బన్: మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ (ఎంఎస్ఈ) ఆదేశాల మేరకు ఆర్డీఏఈ రామంతపూర్ ఆధ్వర్యంలో అప్రెంటిషిప్ అవేర్నెస్ వర్క్ షాప్ (ఎన్ఏడబ్ల్యూ)ను కొత్తగూడెంలోని సింగరేణి గెస్టు హౌస్ సెమినార్ హాల్లో గురువారం నిర్వహించనున్నారని జిల్లా కలెక్టర్ (జిల్లా అప్రెంటిషిప్ కమిటీ చైర్మన్) అనుదీప్ తెలిపారు. జిల్లాలోని పరిశ్రమల యజమానులు, హెచ్ఎంలు సదస్సుకు హాజరు కావాలని సూచించారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట

కొత్తగూడెంరూరల్: అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించుకుని అక్రమంగా నిర్మాణాలు చేపడుతుండగా అధికారులు అడ్డుకున్నారు. గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీనగర్‌కాలనీ గ్రామ పంచాయతీలోని ఇందిరానగర్‌కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పక్కనే అంగన్‌వాడీ కేంద్రం కోసం తొమ్మిదేళ్ల కిందట ప్రభుత్వం స్థలం కేటాయించింది. ఈ స్థలాన్ని కొందరు ఆక్రమించారు. పంచాయతీ సిబ్బంది ముడుపులు తీసుకుని ఇంటి నంబర్‌ను కూడా కేటాయించడంతో ఆక్రమణదారులు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఎస్డీ చాంద్‌పాషా ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని, విచారించి పనులను నిలిపివేశారు.

బాలుడిపై పోక్సో కేసు..

ఇల్లెందురూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఇల్లెందు సీఐ రాజు తెలిపారు. ఇల్లెందులో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. మూడు రోజుల కిందట బాలుడు అదే గ్రామానికి చెందిన రెండున్నరేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన బాలిక తల్లిదండ్రులు వైద్యపరీక్షలు నిర్వహించి పోలీసులను ఆశ్రయించారు. దీంతో విచారణ చేపట్టాక బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఖమ్మం నుంచి ఒడిశా..

- పరుగు తీయనున్న ఆర్టీసీ బస్సులు
- టీఎస్ఆర్టీసీ – ఓడీఎస్ఆర్టీసీ నడుమ కుదిరిన ఒప్పందం
- ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం నుంచి అదనపు సర్వీసులకు అవకాశం
- ఇంతకాలం అధిక ధరలతో దోచుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్

పెరగనున్న సర్వీసులు



టీఎస్ ఆర్టీసీ – ఒడిశా ఆర్టీసీ నడుమ కుదిరిన ఒప్పందంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు పట్టణాలకు ఆర్టీసీ బస్సు సర్వీసుల సంఖ్య పెరగనుంది. ప్రధానంగా ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం పట్టణాల మీదుగా కొత్త సర్వీసులు తిరుగుతాయి. టీఎస్ ఆర్టీసీ ఒడిశా రాష్ట్రానికి 10 సర్వీసులను, ఒడిసా ఆర్టీసీ తెలంగాణలో 13 సర్వీసులను తిప్పేందుకు అంగీకారం కుదిరింది. ఈ సర్వీసుల్లో అత్యధికంగా ఖమ్మం రీజియన్‌లోని భద్రాచలం మీదుగా తిరగనుండడంతో వలస కూలీలకు ఊరట కలగనుంది.

ఖమ్మంమామిళ్లగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సరిహద్దు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం తెలుగు రాష్ట్రాలకు పెద్దసంఖ్యలో ఆదివాసీలు, ఇతరులు వస్తుంటారు. తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాకు పెద్ద సంఖ్యలో ఏటా వలసలు కొనసాగుతాయి. అయితే, తెలంగాణకు రావడానికి.. పనులు ముగిశాక స్వస్థలాలకు వెళ్లడానికి ఒడిశా వాసులకు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు వెళ్లాలంటే ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. ఒడిశాకు ఆర్టీసీ బస్సు సర్వీసులు లేకపోవడంతో ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తుండగా వారు అధిక ధరలతో దోచుకుంటున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం మీదుగా ఒడిశాకు ఆర్టీసీ బస్సులు నడిపించాలని కొన్నేళ్లుగా విజ్ఞప్తులు వస్తున్న నేపథ్యాన తెలంగాణ ఆర్టీసీ, ఒడిశా ఆర్టీసీ మధ్య తాజాగా కుదిరిన ఒప్పందంతో వారికి కొంత ఊరట లభించనుంది.

దోచుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్

హైదరాబాద్ నుంచి ఖమ్మం మీదుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కుంట, జగదల్‌పూర్ ప్రాంతాలకు ఒక ఆర్టీసీ బస్సును తెలంగాణ ఆర్టీసీ అధికారులు తిప్పుతున్నారు. ప్రస్తుతం ఉన్న రద్దీకి ఆ బస్సు సరిపోవడం లేదు. దీంతో ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాల్లో ఉంటున్న వలస కార్మికులు ఖమ్మం వరకు వచ్చి ఇక్కడ నుంచి ప్రైవేట్ ట్రావెల్స్‌లో గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఖమ్మం నుంచి వారి ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులో వెళ్లేందుకు రూ.500 నుంచి రూ.600 వరకు ఖర్చవుతుండగా.. ప్రైవేట్ ట్రావెల్స్‌లో మాత్రం రూ.వెయ్యికి పైగా వసూలు చేస్తున్నారు. ఖమ్మం మీదుగా ఒడిశా, కుంట, జగదల్‌పూర్ ప్రాంతాలకే కాక ఒడిశాకు బస్సులు లేకపోవడంతో ట్రావెల్స్ యజమానులు ఖమ్మం బస్టాండ్ నుంచి రాత్రి వేళ ఆ ప్రాంతాలకు బస్సులను నడుపుతూ వలస కూలీలను దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

రీజియన్ నుంచి నడిపితే లాభమే..

ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు బస్సుల ద్వారా ప్రయాణించే వారి సంఖ్య భారీగా పెరిగింది. గతంతో పోలిస్తే నిత్యం వందలాది మంది ఆ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు ప్రయాణం సాగిస్తున్నారు. ముఖ్యంగా ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం కేంద్రాల నుంచి వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. దీంతో ఖమ్మం రీజియన్ నుంచి ఆయా ప్రాంతాలకు బస్సు సర్వీసులను నడిపితే ఇటు ప్రయాణికులకు, అటు ఆర్టీసీకి లబ్ధి చేకూరనుంది.

ఆదేశాలు రావాల్సి ఉంది..



ఒడిశా ఆర్టీసీ, టీఎస్ ఆర్టీసీ మధ్య సర్వీసులు నడిపేందుకు ఉన్నతస్థాయిలో ఒప్పందం కుదిరింది. ప్రస్తుతానికి హైదరాబాద్ నుంచి ఈ సర్వీసులు తిరగనున్నాయి. ఖమ్మం రీజియన్ నుంచి బస్సులు నడిపే విషయమై యాజమాన్యం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే ఖమ్మం రీజియన్‌లోని డిపోల నుంచి బస్సులు తిప్పేందుకు సిద్ధంగా ఉన్నాం.

– ఎస్తేర్ ప్రభులత, ఆర్ఎం, ఖమ్మం

అసిస్టెంట్ పీపీకి ఎస్పీ అభినందన



లక్ష్మితోపాటు పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ

కొత్తగూడెంటౌన్: పోక్సో కేసులో దుమ్ముగూడెం మండలం తూరుబాక గ్రామానికి చెందిన అజ్మీర సాయికిరణ్‌కు 25 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా పడేలా కృషి చేసిన వారిని జిల్లా ఎస్పీ వినీత్ అభినందించారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రాసిక్యూషన్ తరఫున వాదించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడీ లక్ష్మి, సీఐ దోమల రమేశ్, హెడ్ కానిస్టేబుల్ హరగోపాల్, కానిస్టేబుల్ సీహెచ్ హనుమంతరావును అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఇది అందరి విజయమని పేర్కొన్నారు.

నకిలీ నోట్ల గుట్టురట్టు

- పోలీసుల అదుపులో ముగ్గురు సభ్యుల ముఠా
- ఇల్లెందులో అరెస్టు.. కొత్తగూడెంనకు కేసు బదిలీ



ముఠా సభ్యుల నుంచి స్వాధీనం చేసుకున్న కారు

ఇల్లెందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి నకిలీ నోట్లు తరలిస్తున్న ఓ ముఠా గుట్టు రట్టయింది. కొత్తగూడెం నుంచి ఇల్లెందు మీదుగా హైదరాబాద్ వైపునకు వాహనంలో నకిలీ నోట్లు తరలిస్తున్నారనే సమాచారంతో వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. కొత్తగూడెం నుంచి కారు(టీఎస్ 09 ఎఫ్‌క్యూ 5695)లో రూ.లక్షల్లో అసలు డబ్బుతో కలిపి నకిలీ కరెన్సీని తరలిస్తున్నట్లు కొత్తగూడెం పోలీసులకు సమాచారం అందింది. ఈ ముఠాలో ముగ్గురు సభ్యులు ఉన్నట్లు తెలియగా వారు ఇల్లెందు పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం ఇల్లెందు కరెంటాఫీస్ వద్ద తనిఖీలు చేపట్టిన పోలీసులు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కారులో రూ.3 లక్షల అసలు నగదుతో పాటు పెద్దమొత్తంలో నకిలీ నోట్లు, బ్లాక్ పేపర్లు ఉన్నట్లు గుర్తించారు. ఖమ్మం జిల్లా వేంసూరుకు చెందిన టి.రాజశేఖర్, ఏపీలోని కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం అనుముల లంక గ్రామానికి చెందిన బి.రాంబాబు, కొత్తగూడెం బాబుక్యాంప్ ఏరియాకు చెందిన జె.భాస్కర్‌ను అదుపులోకి తీసుకుని కేసును కొత్తగూడెంనకు బదిలీ చేసినట్లు ఇల్లెందు డీఎస్పీ ఎస్వీ.రమణమూర్తి, సీఐ బి.రాజు వెల్లడించారు. కాగా, ఘటనపై కొత్తగూడెం పోలీసులు పూర్తి వివరాలను వెల్లడించే అవకాశముంది.

భారీగా గంజాయి పట్టివేత

ఇల్లెందులో 12 కేజీల గంజాయి



స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు, నిందితులతో ఎక్సైజ్ అధికారులు



నిందితులను చూపుతున్న పోలీసులు

ఇల్లెందు: తనిఖీలు చేపట్టే పోలీసులకు అనుమానం రాకుండా ఖరీదైన కారులో ఒడిశా నుంచి జిల్లా మీదుగా హైదరాబాద్ తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు ఇల్లెందులో స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఏఈఎస్) కె.తిరుపతి వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి కారులో గంజాయి తరలిస్తున్నారనే సమాచారం అందగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇల్లెందు ఎక్సైజ్ సీఐ వి.రాజశేఖర్‌రావును అప్రమత్తం చేశారు. ఆయన ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జాన్‌శామ్యూల్, ఎస్ఐ ముబీర్ అహ్మద్‌తో కలిసి గురువారం ఉదయం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో స్కోడా కారులోని వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండడంతో పరిశీలించారు. అందులో మల్కన్‌గిరికి చెందిన బిక్రా హీరా, చరంజిత్‌గైన్ పట్టుబడగా, కారు డిక్కీలో రూ.12లక్షల విలువైన 63 కేజీల గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయి, కారు, నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

కొత్తగూడెంలో 4 కేజీలు

కొత్తగూడెంఅర్బన్: ఇద్దరు వ్యక్తుల నుంచి నాలుగు కేజీల గంజాయిని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ముంబైలోని మాన్‌కుర్ద్ ప్రాంతానికి చెందిన షిహిన్ యూసుఫ్‌ఖాన్, మోషిన్‌కదమ్‌అలీ షేక్ కొత్తగూడెం వచ్చి వేణు అనే వ్యక్తి వద్ద నాలుగు కేజీల గంజాయి కొనుగోలు చేశారు. దానిని ఎంహెచ్ 04, టీఎఫ్ 7107 నంబర్ గల గూడ్స్ వాహనంలో తరలిస్తుండగా త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. రూ.78,500 విలువ చేసే నాలుగు కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించారు. వేణు పరారీలో ఉన్నాడు.

పాల్వంచ మండలంలో 2 కేజీలు

పాల్వంచరూరల్: ఇద్దరు యువకుల వద్ద రెండు కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. మండలంలోని బస్వతారక కాలనీ వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద రూ.44 వేల విలువైన గంజాయి పట్టుబడింది. వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకుని వాహనంతోపాటు యువకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులు రుద్రంపూర్‌కు చెందిన ఎంబ్రి దుర్గాప్రసాద్, లక్ష్మీదేవిపల్లికి చెందిన శెట్టిపల్లి శరత్‌బాబుగా గుర్తించామని, వీరిద్దరూ డొంకరాయి గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేశారని, మరో యువకుడు పరారీలో ఉన్నాడని ఎస్ఐ వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

చేపల వేటకు వెళ్లి బాలుడు మృతి



నితిన్ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: సరదాగా చేపల వేటకు వెళ్లిన ఓ బాలుడు గురువారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురంకాలనీకి చెందిన యడ్లపల్లి ఏసు, సునీత దంపతుల కుమారుడు యడ్లపల్లి నితిన్ (15) చేపల వేట కోసం గ్రామ సమీపంలోని కాలువ వద్దకు వెళ్లాడు. కాలువలో చేపలు పట్టే క్రమంలో అదుపుతప్పి నీటిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఇది గమనించిన కొంతమంది వ్యవసాయ కూలీలు వెళ్లి కాలువ నీటిలో పడిపోయిన బాలుడిని బయటకు తీయగా, అప్పటికే మృతి చెందాడు. కాగా నితిన్‌కు చిన్ననాటి నుంచే మూర్ఛ (ఫిట్స్) వ్యాధి ఉండటంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలోనే సరదాగా చేపల వేటకు వెళ్లగా, చేపలు పట్టే క్రమంలో ఫిట్స్ వచ్చి నీళ్లలో పడిపోయి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ బి.రాజేశ్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. నితిన్ తండ్రి ఏసు చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

ప్రేయసి దక్కదేమోనని ఆత్మహత్య

- ఇంటికి తీసుకొచ్చిన యువతిని లాక్కెళ్లిన తల్లిదండ్రులు
- మనస్తాపంతో యువకుడి బలవన్మరణం



దివాకర్ (ఫైల్)

గుండాల: ప్రేమించిన యువతికి ఆమె తల్లిదండ్రులు మరో వివాహం కుదిర్చారు. ఆమె తనకు దక్కదేమోననే బెంగతో ఇంటికి తీసుకురాగా.. యువతి తల్లిదండ్రులు తిరిగి లాక్కెళ్లిపోయారు. మనస్తాపానికి గురైన ఆ యువకుడు పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని జగ్గాయిగూడెం గ్రామానికి చెందిన మొల్కం దివాకర్ (22) టాటా మ్యాజిక్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రయాణాలు సాగిస్తున్న క్రమంలో కొమ్ముగూడెం గ్రామానికి చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారడంతో ఐదేళ్లుగా వారి ప్రేమ కొనసాగింది. ఈ విషయం తెలుసుకున్న యువతి ఇంట్లో వారు వేరే పెళ్లి సంబంధం కుదిర్చారు. దీంతో దివాకర్ బుధవారం ఆ యువతిని పెళ్లి చేసుకుందామని చెప్పి తన ఇంటికి తీసుకొచ్చాడు. ఆ వెంటనే యువతి తల్లిదండ్రులు దివాకర్ ఇంటికి వచ్చి యువతిని తీసుకెళ్లారు. ఐదేళ్లుగా తాను ప్రేమించిన యువతి దక్కదేమోనని మనస్తాపానికి గురైన దివాకర్ గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. కాసేపటికి గుర్తించిన కుటుంబీకులు స్థానిక పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు.

ఎస్పీని కలిసిన టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు



ఎస్పీతో అసోసియేషన్ బాధ్యులు

పాల్వంచ: జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్పీ వినీత్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న తీరును వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు జి.యుగంధర్‌రెడ్డి, కె.జక్రయ, వై.వెంకటేశ్వర్లు, వైటీఎంకే రాజు, ఎండీ ఆరిఫ్, తాళ్లూరి లక్ష్మణ్, అన్నం వెంకటేశ్వర్లు, వి.వాసు, డి.వేణుగోపాల్, గట్టయ్య, డి.రమేశ్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో గొంతు కోసుకున్నాడు..

కరకగూడెం: మద్యం మత్తులో ఓ వ్యక్తి గొంతు కోసుకున్న ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. మండలంలోని మోతె గ్రామానికి చెందిన సురుగు వెంకన్న కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ భార్యతో డబ్బులు ఇవ్వాలని గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి కూడా మద్యం సేవించి ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వాలని తన భార్యతో వాగ్వాదానికి దిగాడు. అనంతరం ఆమె అదే ఊరిలోని తన చెల్లెలు ఇంటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన వెంకన్న ఇంట్లోని కల్లు గీసే కత్తితో గొంతుకోసుకుని బయటికొచ్చి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. రక్తపు మడుగులో ఉన్న అతడిని స్థానికులు గమనించి 108 వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అతడిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బైక్ ఢీకొని వృద్ధుడు మృతి

దమ్మపేట: బైక్ ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ముష్టిబండ గ్రామానికి చెందిన దూతపు సుబ్బయ్య (68) ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా సత్తుపల్లి నుంచి దమ్మపేట వైపు వస్తున్న ద్విచక్ర వాహనం సుబ్బయ్యను బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సుబ్బయ్య అక్కడికక్కడే మృతిచెందాడు.

కారులో చెలరేగిన మంటలు


సుజాతనగర్: మండలంలోని వేపలగడ్డ గ్రామ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గురువారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. భద్రాచలానికి చెందిన పంజా రాజేశ్, రాజేశ్వరి దంపతులు కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లి అక్కడి నుంచి తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో వేపలగడ్డ గ్రామ సమీపంలోకి రాగానే కారు ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కానీ, కారు అలానే వెళ్తున్న క్రమంలో కొందరు స్థానికులు ద్విచక్రవాహనంతో వెంబడించి డ్రైవర్‌కు విషయాన్ని చెప్పారు. దీంతో డ్రైవర్ వెంటనే కారును పక్కకు ఆపేసి దంపతులను బయటకు దింపేశాడు. గమనించిన స్థానికులు ఇంజన్‌పై నీళ్లు చల్లి మంటలను అదుపుచేశారు. స్థానికుల అప్రమత్తత మూలంగా ప్రమాదం తప్పింది. బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా...

దిగజారిన 'ఈనాడు'

- అసత్య ప్రచారం మరోసారి బట్టబయలు
- ఏపీ ప్రభుత్వ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మండిపాటు


అమర్


కొమ్మినేని

సాక్షి, అమరావతి: సీహెచ్ రామోజీరావు సారథ్యంలోని ఈనాడులో నిజాయితీ లోపించిందని.. మోసపూరిత, కుట్ర పూరిత అసత్య ప్రచారం మరోమారు తేటతెల్లమైందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా, అంతర్ రాష్ట్ర వ్యవహారాల సలహాదారు దేవులపల్లి అమర్, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావులు మండిపడ్డారు. పాత ఫొటోలతో పాఠకులను మోసం చేయడం దురదృష్టకరమని గురువారం వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. అసలు నిజం బయట పడ్డాక, అది సాంకేతిక లోపం వల్ల జరిగిందంటూ లోపలి పేజీలో సింగిల్ కాలమ్ వార్తతో సమర్థించుకునే యత్నం మరీ అభ్యంతరకరంగా ఉందన్నారు. ప్రభుత్వంపై, పోలీసులపై ప్రజల్లో వ్యతిరేకత పెంచే లక్ష్యంతో రాసినట్లున్న ఆ కథనంలో 2021 ఫిబ్రవరి 3వ తేదీ నాటి ఫొటోలను ముద్రించడం దారుణమని వ్యాఖ్యానించారు. ఆ ప్రకటనల్లో వారు ఇంకా ఏమేం చెప్పారంటే.. టీడీపీ నేత పట్టాభికి సంబంధించిన వార్తలు బ్యానర్ గానే కాకుండా.. పుంఖానుపుంఖాలుగా మూడు పేజీల్లో పరిచిన తీరు ఆశ్చర్యం కలిగించింది. ఈనాడు తన వివరణను, విచారాన్ని మొదటి పేజీలో వేసి ఉంటే పత్రికా ప్రమాణాలను పాటించినట్లుండేది. తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబు నాయుడుకు వత్తాసు పలికే క్రమంలో రామోజీరావు, ఆయన మీడియా నిస్సిగ్గుగా విశ్వసనీయతనే పణంగా పెట్టి అభూత కల్పనలకు పాల్పడి పరువు పోగొట్టుకుంది. ఈ ఘటనతో అయినా కళ్లు తెరవాలి. తాము ఏం రాసినా జనం నమ్మేస్తారనుకుని ఇంతకాలం జనాన్ని తప్పుదోవ పట్టిస్తున్న ఈనాడు వంకర రాతల గుట్టును సోషల్ మీడియా రట్టు చేసింది. పోలీసులు తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి వేధించారన్న పట్టాభి మాటలను పట్టుకుని, కనీసం విచారించకుండానే ప్రభుత్వ ప్రతిష్ట దిగజార్చాలనుకోవడం తగదు. ఈనాడుతో పాటు చంద్రబాబు విధేయ పత్రికలు, న్యూస్ చానల్స్ తమ వంకర, పక్షపాత, కుట్రపూరిత, మోసపూరిత ధోరణులకు ఇకనైనా స్వస్తి చెప్పాలి.

కట్టుకథలు రాస్తున్న ఈనాడుపై జనాగ్రహం

రాష్ట్ర వ్యాప్తంగా 'ఈనాడు' ప్రతులు దహనం.. ఉవ్వెత్తున ఎగిసిన నిరసనలు

- పట్టాభినీ కొట్టారంటూ పాత ఫొటోలతో తప్పుడు కథనం
- సోషల్ మీడియాలో బట్టబయలు కావడంతో లోపలి పేజీలో సవరణ
- రామోజీ తీరుపై వైఎస్సార్‌సీపీ శ్రేణుల మండిపాటు
- ఈ పత్రిక పుట్టిందే అసత్య వార్తలు రాయడానికని నినాదాలు
- చంద్రబాబును సీఎం చేయాలనే కుట్రతో దిగజారిన పాత్రికేయం
- చంద్రబాబు మేలే లక్ష్యంగా రామోజీరావు కుట్ర సిద్ధాంతం


కొయ్యలగూడెంలో ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షి, అమరావతి: ప్రజలను తప్పుదోవ పట్టించేలా 'ఈనాడు'పత్రిక అసత్య కథనాలు వండి వారుస్తోందని, వారికి అనుకూలమైన చంద్రబాబును సీఎంను చేయాలనే కుట్రతో దిగజారుడు వార్తలు ప్రచురిస్తోందని ఏపీ వ్యాప్తంగా నిరసన ఎగసిపడింది. తప్పుడు వార్తలు రాసి.. ప్రజలను మోసం చేస్తున్న ఈనాడు పత్రిక ప్రతులను గురువారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజా సంఘాలు, సోషల్ యాక్టివిస్టులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో దహనం చేశారు. రామోజీరావు ఇంతగా దిగజారిపోవడం దారుణం అని ఛీకొట్టారు. పట్టాభినీ కొట్టారంటూ పాత ఫొటోలతో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, ప్రభుత్వం మీద బురదజల్లడానికి ఈనాడు చేసిన కుట్ర మరోసారి బట్టబయలు కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉవ్వెత్తున నిరసనలు ఎగిసిపడ్డాయి. వైఎస్సార్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు ఉన్న సెంటర్లల్లో ఈనాడు రామోజీ రావు విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అవి 2021లోని ఫొటోలని సోషల్ మీడియా ద్వారా వైరల్ కావడంతో ఎవరికీ కనిపించని రీతిలో రెండో పేజీలో సింగిల్ కాలంలో 'సవరణ'వేసి చేతులు దులుపుకుందని ఆందోళనకారులు మండిపడ్డారు. ఈనాడు పత్రిక పుట్టిందే అసత్య వార్తలు రాయడానికి అని పెద్ద ఎత్తున నినదించారు. చంద్రబాబును సీఎం చేయాలనే కుట్రతోనే ఈనాడు పత్రిక దిగజారుడు వార్తలు, కథనాలు రాస్తోందని మంత్రులు ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చి, చంద్రబాబుకు ప్రజలను చేరువ చేయాలని రాజగురువు రామోజీ కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు దుయ్యబట్టారు. అసత్యాలను ప్రచారం చేస్తున్న ఈనాడు పత్రికను బహిష్కరించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పిలుపునిచ్చాయి.

ఇవి సోషల్ మీడియా రోజులు

పట్టాభి అనే వ్యక్తి జాతీయ నేతలా ఎల్లో మీడియా జాకీలు వేసి లేపుతోందని, ఇవి ఎల్లో మీడియా రోజులు కావని.. సోషల్ మీడియా రోజులు అని ఆందోళనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు నినాదాలు చేశారు. ఎల్లో మీడియా అని ముద్దుగా పిలుచుకునే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, అనుబంధ సంస్థలు ప్రచురిస్తున్న, చూపుతున్న వార్తలు, కథనాలు చూస్తుంటే ఇంకా దిగజారిపోవడానికి వారికి మెట్లు ఏమీ లేవు అని నిరూపించుకున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు మాత్రమే బాగుండాలనేది రామోజీరావు సిద్ధాంతం.. రామోజీరావుకు వయసు పెరిగి.. బుద్ధి మందగించిందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తూర్పారబట్టారు. కుట్రల రామోజీని బట్టలూడదీసి ప్రజల ముందు నిలబెడతామని మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) హెచ్చరించారు. దుష్ప్రచారం చేసేటప్పుడు బ్యానర్ ఐటమ్స్.. సవరణకు మాత్రం సింగిల్ కాలమా? అని మాజీ మంత్రి కురసాల కన్నబాబు నిలదీశారు. రామోజీ ఆరాటమే తప్ప.. చంద్రబాబుకు రాజకీయ భవిష్యత్ లేదని నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. సంబంధం లేని ఫొటోలను ప్రచురించి ప్రజలను మోసం చేయాలని ఈనాడు యాజమాన్యం కుట్ర చేసిందని, సోషల్ మీడియా దెబ్బకు దిగొచ్చిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ శాసన సభ్యుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు.

రామోజీరావు దిష్టి బొమ్మ దహనం

దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని రీతిలో ఆంధ్రప్రదేశ్‌లో అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిపై, ఆయన ప్రభుత్వంపై ఈనాడు విషం చిమ్ముతుండటాన్ని ప్రజలు ఛీకొడుతున్నారని విజయవాడలో పలువురు నేతలు మండిపడ్డారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామోజీరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ మంటల్లో ఈనాడు ప్రతులను తగులబెట్టారు.



కొత్త గవర్నర్‌తో సీఎం దంపతుల భేటీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన సతీమణి సమీర నజీర్‌లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతిరెడ్డి గురువారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌కు చేరుకున్న సీఎం దంపతులకు గవర్నర్ ముఖ్యకార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, రాజ్‌భవన్ అధికారులు స్వాగతం పలికారు. సీఎం జగన్ దంపతులు గవర్నర్ దంపతులను శాలువతో సత్కరించి, మెమెంటోలు అందజేశారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ సీఎం జగన్‌ను శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రాష్ట్రానికి నూతన గవర్నర్‌గా నియమితులైన అబ్దుల్ నజీర్ బుధవారం రాత్రి విజయవాడకు చేరుకున్న విషయం తెలిసిందే. ఆయన శుక్రవారం గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తారు.

బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే

- పట్టాభి ఘటనపై రామోజీకి ఏపీ మంత్రి అంబటి అల్టిమేటం
- నేటి సాయంత్రం వరకు గడువు ఇస్తున్నాం
- క్షమాపణ కోరకుంటే నేరపూరిత పరువు నష్టం దావా వేస్తాం
- రామోజీ అక్రమ సామ్రాజ్యానికి రక్షకుడు చంద్రబాబే



సాక్షి, అమరావతి: తప్పుడు కథనాలను ప్రచురిస్తున్న ఈనాడుపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో వైఎస్సార్‌సీపీ యుద్ధం చేస్తుందని ఏపీ జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రకటించారు. పట్టాభి ఘటనలో సాంకేతికంగా జరిగిన తప్పులకు చింతిస్తున్నట్లుగా ఎవరికీ కనపడకుండా రామోజీరావు నాలుగు ముక్కలను ప్రచురించడం కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రంలోగా ప్రభుత్వానికి బహిరంగ క్షమాపణ చెప్పకుంటే నేరపూరిత పరువు నష్టం దావా (క్రిమినల్ డిఫర్మేషన్) వేస్తామని హెచ్చరించారు. మంత్రి అంబటి గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

టీడీపీ పోర్న్ స్టార్లతో బూతులు..

రాజకీయంగా కథ ముగిసిన చంద్రబాబు పునరుజ్జీవం కోసం సీఎం జగన్, ప్రభుత్వంపై బురద జల్లుతూ తప్పుడు కథనాలను ప్రచురిస్తారా? టీడీపీ పోర్న్ స్టార్‌లు పట్టాభి, లోకేశ్, చింతకాయల అయ్యన్నలతో సీఎం జగన్‌ను బూతులు తిట్టిస్తూ చంద్రబాబు సైకోలా ఆనందిస్తుంటే ఆర్థిక నేరగాడు రామోజీరావు వాటిని ప్రచురించి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. మార్గదర్శి ద్వారా ఆర్థిక నేరాలకు పాల్పడి రూ.వేల కోట్లతో రామోజీ నిర్మించుకున్న అక్రమ సామ్రాజ్యానికి చంద్రబాబు రక్షకుడిలా వ్యవహరిస్తున్నారు. రామోజీ ఆరాటమేగానీ రాజకీయంగా చంద్రబాబు బతికి బట్టకట్టడం అసాధ్యం.

ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా జానకీరామిరెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా కె.జానకీరామిరెడ్డి మరోసారి గెలుపొందారు. ఆయన తన సమీప అభ్యర్థి ఉప్పుటూరు వేణుగోపాలరావుపై 20 ఓట్ల తేడాతో గెలిచారు. మొత్తం 1,438 ఓట్లు పోల్ కాగా.. జానకీరామిరెడ్డికి 703, వేణుగోపాలరావుకు 683, మరో అభ్యర్థి డీఎస్ఎన్‌వీ ప్రసాద్‌బాబుకు 38 ఓట్లు వచ్చాయి. కొన్ని ఓట్లు చెల్లలేదు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా జానకీరామిరెడ్డి గెలుపొందడం ఇది వరుసగా రెండోసారి. కాగా ఉపాధ్యక్షుడిగా పీఎస్‌పీ సురేష్‌కుమార్ గెలుపొందారు. ఆయన తన సమీప అభ్యర్థి తుహిన్ కుమార్‌పై 52 ఓట్ల తేడాతో గెలిచారు. ప్రధాన కార్యదర్శిగా వి.సాయికుమార్, సంయుక్త కార్యదర్శిగా సాల్మన్ రాజు, కోశాధికారిగా బీవీ అపర్ణలక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శిగా జ్ఞానేశ్వరరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డి పితాని, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా అన్నం శ్రీధర్, మారుతి విద్యాసాగర్, కాశీ అన్నపూర్ణ, షేక్ ఆసిఫ్, శాంతికిరణ్, శరత్, అచ్యుత రామయ్య విజయం సాధించారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి తప్పుకుంటున్నాం

ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు దివాకర్

సాక్షి, అమరావతి: జాయింట్ యాక్షన్ కమిటీలో ఉన్న సంఘాల సమష్టి నిర్ణయం మేరకు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ తప్పుకుంటోందని ఆ కమిటీ చైర్మన్ వీఎస్ దివాకర్ స్పష్టం చేశారు. ఇక నుంచి తమకు ఆ సంఘంతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చర్యల వల్ల ఉద్యోగులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున, ఉద్యోగులందరూ ఆ సంఘానికి దూరంగా ఉండాలని సూచించారు. గురువారం ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం తాడేపల్లిలో నిర్వహించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు. 'ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వంతో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వంపై పబ్లిసిటీ కోసం గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం అభ్యంతరకరం. ఈ ఘటన వల్ల ఉద్యోగుల మనోభావాలు దెబ్బతిన్నాయి'అని తెలిపారు.

ఎన్‌వైకే యూత్ వలంటీర్లుగా దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా నెహ్రూ యువక కేంద్రం (ఎన్‌వైకే) ఆధ్వర్యాన 2023-2025 సంవత్సరానికి గాను ఉమ్మడి జిల్లా పరిధిలోని నేషనల్ యూత్ వలంటీర్లనునియమించనున్నట్లు జిల్లా అధికారి చింతల అన్వేష్ తెలిపారు. 18నుంచి 29ఏళ్ల వయస్సు కలిగి చదువుకుంటున్న, ఉద్యోగాలు చేస్తున్న యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. యువజన సంఘాల స్థాపన, ఆరోగ్యం, క్రీడలు, సాంస్కృతిక, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎంపికైన వారికి నెలకు రూ.5వేల గౌరవ వేతనం అందుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మార్చి 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 0870-2958776, 87906 01617 నంబర్లలో సంప్రదించాలని అన్వేష్ సూచించారు.

11, 12వ తేదీల్లో యంగ్ లీడర్స్ వర్క్‌షాప్

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ కళాశాలలో వచ్చేనెల 11, 12వ తేదీల్లో జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన యంగ్ లీడర్స్ వర్క్‌షాప్ ఏర్పాటుచేశారు. ఈ విషయాన్ని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులుగా ఎదగాలనుకుంటున్న వారికి మార్గనిర్దేశం చేసేలా నిష్ణాతులైన వక్తల ప్రసంగాలు ఉంటాయని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొనాలనుకునే వారు వివరాల కోసం 90000 37676, 90000 74646 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఏఐసీసీ ప్లీనరీకి పొదెం వీరయ్య, దుర్గాప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొదెం, పక్కన నాయకులు

భద్రాచలం అర్బన్: ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో జరగనున్న ఏఐసీసీ ప్లీనరీలో భద్రాచలం ఎమ్మెల్యే, కాంగ్రెస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య పాల్గొననున్నారు. అలాగే, కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కూడా ఆయన వెంట గురువారం బయలుదేరారు. ఇంకా టీపీసీసీ సభ్యులు, నాయకులు బుడగం శ్రీనివాస్, రాయల నాగేశ్వరరావు, నల్లపు దుర్గాప్రసాద్, వడ్డే నారాయణరావు, సరెళ్ల నరేష్, సరెళ్ల వెంకటేష్ తదితరులు ప్లీనరీకి హాజరుకానున్నారు. ఈమేరకు భద్రాచలంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ప్లీనరీ వివరాలను పొదెం వీరయ్య వెల్లడించారు.

జిల్లా వార్తలు

'ఉపాధి' వేటలో విషాదం

- మరిపెడ మండలం నుంచి క్యాటరింగ్‌కు వచ్చివెళ్తుండగా ప్రమాదం
- ఆటోను వేగంగా ఢీకొట్టిన గ్రానైట్ లారీ
- తొమ్మిది మందికి తీవ్ర గాయాలు, చికిత్స పొందుతూ ఒకరి మృతి




ఘటనా స్థలంలో తీవ్రగాయాలతో పడి ఉన్న సాయికుమార్, మరో వ్యక్తి, పక్కన నుజ్జునుజ్జయిన ఆటో (ఇన్‌సెట్) ఆటోను ఢీకొట్టిన లారీ

ఖమ్మంరూరల్: ఒకరిద్దరు తప్ప అందరూ ఇంటర్, డిగ్రీ చదువుకుంటున్న వారు, పూర్తిచేసిన వారే. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన వారు చదువుతో నిమిత్తం లేకుండా ఉపాధి వేటలో క్యాటరింగ్ పనులకు వెళ్తుంటారు. అలాగే ఖమ్మం జిల్లాకు వచ్చిన వారు ఆటోలో తిరిగి వెళ్లే క్రమంలో గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తొమ్మిది మందికి తీవ్ర గాయాలు కాగా.. చికిత్స అందిస్తుండగా ఒకరు మృతి చెందారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలో గురువారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి.

మరిపెడ నుంచి గొల్లగూడెం..

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వెంకంపాడుకు చెందిన పత్తిపాల గణేష్ క్యాటరింగ్ మేస్త్రిగా పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో ఆయన చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పలువురితో జట్టుగా ఏర్పడి ఎక్కడ క్యాటరింగ్ పనులు జరిగిన వెళ్లివస్తారు. ఇందులో భాగంగానే గణేష్ సహా తొమ్మిది మంది గురువారం ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెంలో ఓ వ్యక్తి దశదిన కర్మకు క్యాటరింగ్ చేయడానికి ఆటో మాట్లాడుకుని వచ్చారు. గొల్లగూడెంలో పని ముగిశాక సాయంత్రం తమ స్వగ్రామాలకు ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యలోని కొండాపురం బస్టాప్ వద్ద వరంగల్ వైపు నుండి రాజమండ్రి వైపు గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీ ఆటోను ఎదురుగా అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న వారంతా ఎగిరి రహదారిపై చెల్లాచెదురుగా పడ్డారు. ఈ ఘటనలో మరిపెడ మండలం యలమంచిలిపురానికి చెందిన బానోత్ సాయికుమార్, గిరిపురానికి చెందిన బదావత్ మంగీలాల్, ఇటుకలపాడు తండాకు చెందిన భూక్యా రాందాస్, వెంకంపాడుకు చెందిన పత్తిపాల గణేష్(క్యాటరింగ్ మేస్త్రీ), ఇటుకలపాడుకు చెందిన భూక్యా సంతోష్, బదావత్ తండాకు చెందిన బదావత్ సుధీర్, బదావత్ రాజు, భూక్యా చరణ్, నటావత్ వెంకటేష్ కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే, తలకు తీవ్ర గాయాలైన బానోత్ సాయికుమార్(19) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే, తలకు తీవ్ర గాయాలైన మంగీలాల్, మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. దీంతో వైద్యులు వీరికి అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు.

చదువుకున్న వారే...

ప్రమాదం బారిన పడిన వారిలో ఒకరిద్దరు తప్ప మిగతా వారు ఇంటర్, డిగ్రీ వరకు చదువుకున్న, చదువుకుంటున్న వారేనని తెలుస్తోంది. చదువుకుంటూనే కుటుంబానికి చేదోడుగా ఉండటానికి క్యాటరింగ్ పనులు వెళ్తున్నారు. ఇలా అనుకోని ప్రమాదంలో ఒకరు మృతి చెందడం, మిగతా వారు తీవ్రగాయాల పాలు కావడంతో వారి కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఇక లారీ బలంగా ఢీకొట్టగా ఆటోలోని వారు చెల్లాచెదురుగా రహదారిపై పడడంతో ఏం జరిగిందో తెలియక మిగతా వాహనదారులు ఆందోళన చెందారు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

తునికాకు కట్టకు రూ.3.50 చెల్లించాలి

మావోయిస్టు పార్టీ బీకే - ఏఎస్ఆర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్

చర్ల: ఎలాంటి వివక్ష లేకుండా అన్ని ప్రాంతాల్లో తునికాకు సేకరణ చేపట్టడంతో పాటు కట్టకు రూ.3.50 చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బోనస్ విడుదల చేయాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. ఈమేరకు మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరుతో గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని పూజారిగూడెం-లెనిన్‌కాలనీ మధ్య ప్రధాన రహదారిపై వాల్‌పోస్టర్లు, కరపత్రాలు వదిలారు. అందులోని వివరాల ప్రకారం.. పెరుగుతున్న నిత్యావసరాల ధరలను పరిగణనలోకి తీసుకోకుండా ధర నిర్ణయిస్తున్నారని.. అలా కాకుండా కట్టకు రూ.3.50 చెల్లించాలని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో మొదెం కొట్టే పనులు చేపడుతున్న మధ్యవర్తులు వ్యవసాయ కూలీల కంటే తక్కువ కూలీ చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా అన్ని ప్రాంతాలలో మొదెం కొట్టే పనులు తక్షణమే ప్రారంభించి, మొదెం కొట్టే కూలీలకు రూ.700 వేతనం, 50 ఆకుల తునికాకు కట్టకు రూ.3.50తో పాటు కార్మికులకు పెండింగ్ బోనస్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆకు సేకరణలో ప్రమాదాలకు గురయ్యే కార్మికులకు వైద్య ఖర్చులు, కుటుంబ పోషణకు రూ.2 లక్షలు, మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వాల్‌పోస్టర్లలో మావోయిస్టు పార్టీ డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు.

రైల్వే ఆస్తులను ధ్వంసం చేస్తే చర్యలు

మహబూబాబాద్ రూరల్: రైల్వే ఆస్తులను ధ్వంసం చేసినా, రైళ్లపై రాళ్లు విసిరినా కఠిన చర్యలు తప్పవని కాజీపేట జీఆర్‌పీ డీఎస్పీ మల్లారెడ్డి హెచ్చరించారు. మహబూబాబాద్, గుండ్రాతిమడుగు, గార్ల, డోర్నకల్ రైల్వే స్టేషన్ల పరిసర ప్రాంతాల ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రయాణికులను వేగంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న వందే భారత్ రైలుపై కొందరు రైళ్లు విసురుతున్నారని, ఇలా చేసే వారిని గుర్తించి కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఎస్సైలు కె.శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

భారజల కర్మాగారానికి 'బెస్ట్ ఫర్‌ఫార్మెన్స్' అవార్డు


జీఎం కేవీ.థాలేకు అవార్డు అందజేస్తున్న భారజల బోర్డు అధికారులు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని మణుగూరు భారజల కర్మాగారానికి 2021-22 ఏడాదికి గాను ప్రతిష్టాత్మక బెస్ట్ ఫర్‌ఫార్మెన్స్ ప్లాంట్ అవార్డు ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం కర్మాగారంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జీఎం కేవీ.థాలేకు ఐఎఫ్‌ఏ గోపాల ప్రసాద్, మనీషారాణి, బోర్డు సీఏఓ స్వామినాథన్ అవార్డు అందజేశారు. శక్తి వినియోగం, ఇంధన పొదుపు, ఉత్పాదకత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఏటా ప్రకటించే ఈ అవార్డు 2020-21లోనూ మణుగూరు భారజల కర్మాగారానికి దక్కగా రెండో సారి కూడా అవార్డు రావడం విశేషం. ఈసందర్భంగా జీఎం కేవీ.థాలే మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగుల సమన్వయంతోనే రెండు సార్లు అవార్డు సాధించగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారజల కర్మాగారం డీజీఎంలు జగ్గారావు, హరిప్రసాద్, సీఏఓ కాంబ్లే, ప్రొడక్షన్ మేనేజర్ జీ.శ్రీనివాస్, ఎంప్లాయీస్ అసోసియేషన్, సూపర్‌వైజరీ స్టాఫ్ అసోసియేషన్ల బాధ్యులు ఎం.వెంకటరెడ్డి, రాయల రాజేష్, విష్ణువర్ధన్‌రాజు, వేణుగోపాల్, కేటీ.రావు, జీఎస్.రెడ్డి, వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ సీఈలకు సమ్మె నోటీసులు


జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబుకు నోటీస్ ఇస్తున్న జేఏసీ నాయకులు

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగులకు పీఆర్‌సీతో పాటు 2022, 1999-2004 బ్యాచ్ ఉద్యోగులకు జీపీఎఫ్ అమలుచేయాలనే డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలపాలని జేఏసీ నిర్ణయించింది. ఈమేరకు గురువారం పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో 5, 6, 7వ దశల సీఈలు ఎం.ప్రభాకర్‌రావు, పి.వెంకటేశ్వరరావు, ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాస బాబుకు జేఏసీ బాధ్యులు సమ్మె నోటీసులు అందించారు. అనంతరం టీఎస్‌పీఈ జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్‌కు అన్ని కార్యాలయాలు, సబ్‌స్టేషన్ల వద్ద నిరసనలు చేపట్టనున్నామని తెలిపారు. ఈనెల 24 నుంచి 28 వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన, మార్చి 1 నుండి 4వ తేదీ వరకు మధ్యాహ్న భోజన విరామంలో సమావేశాలు, 8న ర్యాలీలు, 14న కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో నిరసన, 24న విద్యుత్ సౌధ ఎదుట మహా ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు రాజేందర్, కోటేశ్వరరావు, మంగీలాల్, బ్రహ్మాజీ, శ్రీనివాసరావు, సీతారాంరెడ్డి, నాగరాజు, గణేష్, రాధాకృష్ణ, వెంకటేశ్వరరావు, నర్సింహారావు, రవీందర్, కోటేశ్వరరావు, రాందాస్, నాగేశ్వరరావు, గిరిధర్, నాగేశ్వరరావు, ప్రభాకర్, వెంకటేశ్వరరావు, సయ్యద్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ ఎంపిక పోటీలు పూర్తి


ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్/కొణిజర్ల: సీనియర్స్ విభాగంలో రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు పురుషుల, మహిళల జట్ల ఎంపిక గురువారం చేపట్టారు. ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యాన కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలోని గ్రేస్ విద్యాలయంలో ఈ ఎంపిక పోటీలు నిర్వహించగా ఖమ్మం డీవైఎస్‌ఓ ఏ.పరంధామరెడ్డి, ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాదుల సారంగపాణి, పుట్టా శంకరయ్య పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 మంది క్రీడాకారులు పాల్గొనగా, వివిధ విభాగాల్లో ఈ.ఆనంద్, కె.పృథ్వీ, కె.లక్ష్మణ్, కె.అశ్విత్‌దొర, శివసాయి, టి.సౌమ్య, టి.శేఖర్ ఎంపికయ్యారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పోటీల్లో వీరు పాల్గొంటారని డీవైఎస్‌ఓ తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో సంఘం ప్రతినిధులు బాలసుబ్రహ్మణ్యం, వెంకటనారాయణ, ఎస్.వెంకటరావు, గ్రేస్ ఉద్యోగులు వేణు, ప్రసాద్, వాణి, పుల్లారావు, కోచ్ మరెప్ప తదితరులు పాల్గొన్నారు.